క్లుప్తంగా

‘ఏకలవ్య’లో ఉన్నత ప్రమాణాలతో బోధన

• ఐటీడీఏ పీఓ రాణి మందా



విద్యార్థినికి అడ్మిషన్ లెటర్ ఇస్తున్న పీఓ

కొడవలూరు : ఈఎంఆర్ఎస్(ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్) పాఠశాల, కళాశాలల్లో ఉన్నత ప్రమాణాలతో సీబీఎస్ఈ సిలబస్ బోధన ఉంటుందని ఐటీడీఏ పీఓ రాణి మందా తెలిపారు. మండలంలోని చంద్రశేఖరపురం ఈఎంఆర్ఎస్‌లో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరికకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె, పదిలో ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు సీట్లు కేటాయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీబీఎస్ఈ పద్ధతిలో దేశమంతా ఒకే సిలబస్ ఉంటుందని తెలిపారు. ఈఎంఆర్ఎస్‌లలో మెరుగైన వసతులు కల్పించడంతో పాటు ఉన్నత ప్రమాణాలతో బోధన సాగుతుందన్నారు. ఎస్టీ పిల్లలకు పైసా ఖర్చు లేకుండా సకల వసతులతో మెరుగైన బోధన అందించడమే ఈఎంఆర్ఎస్ లక్ష్యమన్నారు. ఇందులో సీట్ల కేటాయింపు ఎంతో పారదర్శకంగా, ప్రతిభ ఆధారంగా జరుగుతుందన్నారు. ఇక్కడ విద్యనభ్యసించిన వారు ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఇక్కడ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ఉన్నందున ఇక్కడ పది పూర్తి చేసుకున్న వారే ఇంటర్‌లోనూ చేరుతున్నట్లు తెలియజేశారు. మిగిలిన సీట్లను మాత్రమే బయటి విద్యార్థులతో భర్తీ చేస్తామని చెప్పారు. జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో ఉన్న ఖాళీలను బుధవారం నిర్వహించిన కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేశామన్నారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో వంద శాతం సీట్లు భర్తీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ టి.విష్ణుప్రియ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శివకుమార్, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలతో రక్తహీనతకు చెక్



సంజీవనగర్‌లో రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కొడవలూరు : ముందు జాగ్రత్త చర్యల ద్వారా రక్తహీనత సమస్యకు చెక్ పెట్టవచ్చని కొడవలూరు వైద్యాధికారి ఎం.రామకృష్ణ తెలిపారు. మండలంలోని సంజీవనగర్‌లో గిరిజనులకు బుధవారం రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల్లో తలెత్తుతున్న రక్తహీనతకు స్వస్తి చెప్పేందుకు వైద్య ఆరోగ్య శాఖ దృష్టి సారించిందన్నారు. అందుకోసం ప్రత్యేకంగా ‘నేషనల్ సికెల్ సెల్ అనీమియా ఎలిమినేషన్ మిషన్’ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ఇందులో భాగంగా అన్ని గిరిజన కాలనీల్లో వంద శాతం మందికి రక్తపరీక్షలు నిర్వహించి రక్త శాతాన్ని పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఎవరిలోనైనా రక్త శాతం మందగిస్తే రక్త హీనతకు దారి తీసే ప్రమాదం ఉందని నిర్ధారిస్తామన్నారు. అలాంటి వారికి పోషకాహారం, ఐరన్ మాత్రలు అందేలా చూసి సమస్య రాకుండా నివారిస్తామన్నారు. పోషకాహారం లోపించినప్పుడే రక్తహీనత తలెత్తే ప్రమాదం ఉంటుందన్నారు. రక్తహీనత కేన్సర్‌కు దారి తీస్తుందన్న విషయంపై అందరికీ అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం టి.రాధమ్మ, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి



టీకాలు వేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

దుత్తలూరు: గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి అని హెల్త్ సూపర్‌వైజర్ షేక్ ఖాజామొహిద్దీన్ తెలిపారు. మండలంలోని సోమలరేగడ సచివాలయంలో బుధవారం నిర్వహించిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం వైద్యారోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. క్షయ వ్యాధి నిర్మూలనకు వయోజనులకు అడాల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌ను సోమ, గురువారాల్లో వేయాలని సూచించారు. పిల్లల ఎత్తు, బరువులను ఎంసీపీ కార్డులో నమోదు చేయాలని తెలిపారు. తీవ్ర పోషకాహారలోపంతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించి నెల్లూరు న్యూట్రిషన్ రీహ్యాబిలిటేషన్ సెంటర్‌కు తరలించాలని సూచించారు. అంగన్‌వాడీ సెంటర్‌కు వచ్చే పిల్లలతో ఐరన్, పోలిక్‌యాసిడ్ సిరప్‌లు తాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఎస్ చంద్రావతి, అంగన్‌వాడీ టీచర్ డీ లక్ష్మమ్మ, ఆశాకార్యకర్త రమణమ్మ పాల్గొన్నారు.

అరచేతిలో వాతావరణం

అరచేతిలో వర్షాలు, ఈదురుగాలులు, పిడుగులు పడే సమాచారం పూర్తిస్థాయిలో తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఇందుకోసం మనం ముందుగా ఆయా యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు వాతావరణ సమాచారం తెలుస్తుంది. దీనిద్వారా ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ పంట, పాడి సంపదను కాపాడుకోవచ్చు.

- ప్రత్యేక యాప్‌లను రూపొందించిన కేంద్ర ప్రభుత్వం
- పంచాయతీ స్థాయిలో వాతావరణం అంచనా
- వ్యవసాయ, అనుబంధ రంగాల యజమానులకు ప్రయోజనకరం



నెల్లూరు సిటీ : దేశ ఆర్థిక రంగానికి ప్రాణాధారం వ్యవసాయం, వాటి అనుబంధ రంగాలు. రైతులకు విత్తు నాటడం మొదలు పంటను విక్రయించుకునే వరకు అడుగడుగునా సవాళ్లు ఉంటాయి. అయితే ఈ సమస్యలు రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. వర్షాలు, ఈదురుగాలులు, పిడుగుపాటు ప్రమాదాలను స్మార్ట్‌ఫోన్ ద్వారా తెలుసుకోవచ్చు. పిడుగుపాటు సమాచారం ముందుగా తెలుసుకుంటే పాడి సంపదను రక్షించుకునే అవకాశాలు ఉంది. తీవ్రవర్షం కురిసే సమాచారం ముందుగా తెలుసుకోవడం ద్వారా చేతికి వచ్చిన పంటను రక్షించుకోవచ్చు. భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ద్వారా గ్రామ పంచాయతీ స్థాయిలో వాతావరణం అంచనాలు విడుదల చేస్తోంది. చేతిలో స్మార్ట్‌ఫోన్, ఇంటర్‌నెట్ సౌకర్యం ఉంటే ఈ వివరాలను తెలుసుకోవచ్చు.

మెసేజ్ రూపంలో మేఘదూత్



పంట సాగులో విత్తనం నుంచి ఎరువులు వేసే సమయం లేదా పంట నూర్పిడి సమయంలో రైతులను నష్ట పరిచేవి వర్షమే. ఇలాంటి నష్టాల నుంచి బయటపడేందుకు ‘మేఘదూత్’ యాప్‌ను రూపొందించారు. దీని సాయంతో వారం ముందుగా నాలుగు, ఐదు రోజుల వాతావరణ మార్పులు, వర్షసూచిక సహా ఆకాశం మేఘావృతం అవుతుందా? లేదా.. గాలులు ఏ దిశ నుంచి వీస్తాయి? తేమ శాతం, ఉష్ణోగ్రత వివరాలను తెలుసుకునే అవకాశం ఉంది. ఈ యాప్ ద్వారా ప్రతి మంగళ, శుక్రవారాల్లో చారిత్రాత్మక వాతావరణ సమాచారంతో అగ్రో మెట్ ఫీల్డ్ యూనిట్లు (ఏఎంఎఫీయూ) రైతులకు మెసేజ్ రూపంలో పంపుతున్నాయి.

వర్షం ముప్పును తెలిపే ‘రెయిన్ అలారమ్’



గూగుల్ ప్లేస్టోర్ నుంచి రెయిన్ అలారమ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వినియోగదారుడు అందించిన సమాచారం మేరకు అతను ఉండే ప్రాంతానికి సమీపంలో ఎక్కడ వర్షం పడే సూచనలను క్షణాల్లో తెలుసుకోవచ్చు. వర్షం ముప్పును గుర్తించి ముందే జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

మెరుపులు తెలిపే ‘దమిని’



ఎప్పటికప్పుడు మెరుపు హెచ్చరికలను తెలియజేసేందుకు ‘దమిని’ యాప్ ఉపయోగపడుతుంది. దీని సాయంతో సమీపంలో 20 కి.మీ పరిధిలో ఐదు నుంచి 20 నిమిషాల వ్యవధిలో ఎక్కడ పిడుగుపడే అవకాశం ఉందో అప్రమత్తం చేస్తుంది. మెరుపు ఎందుకు వస్తుంది, మెరుపు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ యాప్ వివరిస్తుంది. లోకేషన్ ఆధారంగా ఎక్కడెక్కడ మెరుపులు వచ్చే అవకాశం ఉందో సూచిస్తుంది. పిడుగు పడినప్పుడు తోటివారికి అందించాల్సిన వైద్య సాయం, శ్వాస ఆగిపోతే నోటి నుంచి శ్వాసను అందించడం, గుండె ఆగిపోతే సీపీఆర్ చేయడం తదితర వివరాలతో పాటు పిడుగు పడినప్పుడు ప్రాథమికంగా చేయకూడని, చేయాల్సిన పనులు ఇందులో తెలుసుకోవచ్చు.

‘వజ్రపాత్’తో పిడుగుల సమాచారం



గూగుల్ ప్లేస్టోర్ నుంచి వజ్రపాత్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ నొక్కితే రెండు రకాల సమాచారం వస్తుంది. ఎడమ వైపు పిడుగుల సమాచారం కనిపిస్తుంది. అక్కడ మనం ఉన్న ప్రాంతానికి సంబంధించిన మ్యాప్ కనిపిస్తుంది. రెడ్, ఆరెంజ్, ఎల్లో కలర్లలో వలయాలు కనిపిస్తాయి. వీటి పక్కనే 8, 15, 30 అంకెలుంటాయి. ఈ అంకెల ప్రకారం కొద్ది సేపట్లో ఎంత దూరంలో (కి.మీలలో) పిడుగుపడే అవకాశం ఉందనేది చూపిస్తుంది. అలాంటిదేమీ లేకపోతే సమీపంలో పిడుగుపడే అవకాశం లేదనే సమాచారం కనిపిస్తుంది. ఎంత దూరంలో పడుగు పడుతుందో పిన్ రూపంలో స్పష్టత ఇస్తుంది. యాప్ కుడి భాగంలో పిడుగుపాటు హెచ్చరికలు తెలిపే బటన్ ఉంటుంది. దీనిద్వారా ఎప్పటికప్పుడు అప్రమత్తం కావచ్చు.

కవి పెరుగు రామకృష్ణకు పురస్కారం

నెల్లూరు(బృందావనం) : గ్రీకు, ఇటాలియన్ దేశాలకు చెందిన ఇద్దరు మహా రచయితలు హోమర్, డాంటేల స్మారక అంతర్జాతీయ పురస్కారాలను నెల్లూరీయుడైన తెలుగు కవి డాక్టరు పెరుగు రామకృష్ణ అందుకున్నారు. అందుకు సంబంధించి పెరుగు రామకృష్ణ బుధవారం మాట్లాడారు. ప్రాచీన గ్రీకు సాహిత్యానికి, పాశ్చాత్య సాహిత్య సంప్రదాయాలకు పునాది వేసిన హోమర్, అలాగే ఇటాలియన్ కవి, రచయిత డాంటే అలిఘిరి సాహిత్య పురస్కారాలను ఆన్‌లైన్ ద్వారా అందుకున్నట్లు వివరించారు. తాను చేసిన రచనలకు గుర్తింపుగా ఆయా దేశాలకు చెందిన సంస్థల నిర్వాహకులు పురస్కారాలను ప్రదానం చేశారని తెలియజేశారు.

సులభంగా పక్షవాత నిర్ధారణ

నెల్లూరు(మినీబైపాస్) : అధునాతన కెరోటిడ్ డాప్లర్ యంత్రం ద్వారా పక్షవాతాన్ని ముందుగానే నిర్ధారించవచ్చని న్యూరాలజిస్ట్ డాక్టర్ యామిని తెలిపారు. పెద్ద బజారులోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. నగరంలో న్యూరాలజీకి సంబంధించి అధునాతన పద్ధతుల్లో తయారు చేసిన కెరోటిడ్ డాప్లర్ యంత్రాన్ని పొగతోటలోని యామిని న్యూరో కేర్ వైద్యశాలలో అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. సమావేశంలో డాక్టర్ ఎం డీ హర్షవర్ధన్ పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమ వాడకంపై కేసు నమోదు

మనుబోలు : మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసి జరిమానా విధించినట్లు ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ నాగార్జున బుధవారం తెలిపారు. చెర్లోపల్లి గ్రామానికి చెందిన రఘురామయ్య ఇంటికి అక్రమ మార్గంలో కరెంటు వైరు వేసి ఏసీ వాడుతున్నాడని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో తనిఖీ చేశామన్నారు. అక్రమ విద్యుత్ వాడకం నిజమని నిర్ధారణ కావడంతో కేసు నమోదు చేసి జరిమానా విధించినట్లు తెలిపారు.

తాగునీటి సమస్యకు 24 గంటల్లో పరిష్కారం



మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్

• కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు) : నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటి సరఫరాను వాటర్ మానిటరింగ్ స్కీమ్ అప్లికేషన్‌తో పర్యవేక్షిస్తామని, దీనిద్వారా 24 గంటల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్ వెల్లడించారు. ఈ మేరకు కార్పొరేషన్ కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో ఇంజినీరింగ్ విభాగం, సచివాలయ కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నూతన వాటర్ మానిటరింగ్ టూల్ నిర్వహణకు ప్రతి అమెనిటిస్ సెక్రటరీకి లాగిన్ ఉంటుందన్నారు. స్థానిక కార్యదర్శి పరిధిలో అన్ని వీధుల వివరాలు, ఇళ్ల వివరాలు, వారి పేర్లు, డోర్ నంబర్లు తదితర వివరాలు నమోదు చేయాలన్నారు. తరువాత ఎమెనిటీ సెక్రటరీ ప్రతి రోజు నిర్దేశించిన ప్రాంతాల్లో 15 రోజులకు ఒకసారి విజిట్ చేసి ఆ ఇంటికి సప్లయ్ చేస్తున్న వాటర్ క్వాలిటీ, క్వాంటిటీలను చెక్ చేసి యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. తనిఖీ చేస్తున్న సమయంలో పైప్‌లైన్లు, వాటర్ ట్యాప్స్ లీకులు ఏమైనా ఉంటే వాటిని ఆ యాప్‌లో నమోదు చేస్తే సంబంధిత ఏఈ, డీఈ, ఈఈలకు ఆన్‌లైన్ ద్వారా చేరుతాయని వివరించారు. రానున్న మంగళవారం నుంచి ఈ విధానాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం తాగునీటి నాణ్యత పరీక్ష పరికరాలను కార్యదర్శులకు అందజేశారు. సమావేశంలో నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం అధికారులు సంజయ్, చంద్రయ్య, సచివాలయ ఎమినిటీస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

తొలిరోజే పుస్తకాలను అందజేయాలి



పాఠ్య పుస్తకాలను అందజేస్తున్న డీఈఓ రామారావు

నెల్లూరు (టౌన్) : ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభించిన రోజే విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలను అందజేయాలని డీఈఓ పీవీజే రామారావు ఆదేశించారు. స్థానిక వెంగళరావునగర్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్‌లో డీఈఓ రామారావు చేతుల మీదుగా మండలంలోని పాఠశాలలకు స్టూడెంట్ కిట్స్, పాఠ్యపుస్తకాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూనిఫాం, బూట్లు, బెల్టులు, సాక్స్‌ల నాణ్యతను పరిశీలించారు.

విద్యావకాశాలు అందుబాటులో ఉండాలి



చిన్నారులకు నోటు పుస్తకాలను అందజేస్తున్న సీనియర్ జడ్జి వాణి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : సమాజంలో ఉన్న పిల్లలందరికీ విద్యావకాశాలు అందుబాటులో ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి తెలిపారు. ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నగరంలోని ఏకే నగర్‌లో ఉన్న గీతామయి బాలభవన్ ట్రస్ట్‌లో న్యాయ విజ్ఞాన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి వాణి మాట్లాడుతూ ప్రతి ఏడాది జూన్ 12వ తేదీ ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. పిల్లలు బాగా చదువుకోవాలని సూచించారు. భారతదేశంలో 14 ఏళ్లలోపు పిల్లలు కర్మాగారాలు, ప్రమాదకర వృత్తుల్లో పనిచేయడాన్ని భారత రాజ్యాంగం నిషేధించిందని గుర్తుచేశారు. పిల్లలకు ఎలాంటి సమస్యలు ఉన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. అనంతరం పిల్లలకు నోటు పుస్తకాలు, బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో బాలభవన్ ట్రస్ట్ కన్వీనర్ పాండు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం రేపు



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ముత్తుకూరు : సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం ఈనెల 14వ తేదీన జరుగుతుందని ఆ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి గోడ భాస్కర్ చెప్పారు. స్థానిక శ్రామిక భవన్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐటీయూ ఏర్పడి 54 సంవత్సరాలు పూర్తవుతుందని, దీని ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నేలటూరులోని ఏపీజెన్‌కో ప్రాజెక్టు మెయిన్ గేటు వద్ద 14వ తేదీన మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి నాగరాజు, నక్కా శ్యామ్‌ప్రసాద్, ఆనూరి అనిల్ పాల్గొన్నారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు



మనుబోలు : మనుబోలు బీసీ కాలనీ సమీపంలో కొలువైన వరసిద్ధి వినాయకునికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు శ్రీనివాసులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. విశేష పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉభయకర్తలుగా కావేటి పెంచలయ్య, లక్ష్మమ్మ దంపతులు వ్యవహరించారు.

పారిశుద్ధ్య కార్మికులకు అన్నదానం



నెల్లూరు(బృందావనం) : నగరంలోని జెండావీధి కోటమిట్ట శానిటరీ కార్యాలయ ప్రాంగణంలో పారిశుద్ధ్య కార్మికులు, పేదలకు బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు నయీంఖాన్ మాట్లాడుతూ బక్రీద్ పండుగ రాకను పురస్కరించుకుని సామాజిక సేవలో భాగంగా కోటమిట్ట శానిటరీ కార్యాలయ పరిధిలో విధులు నిర్వహిస్తున్న నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికులకు, అలాగే పేదలకు అన్నదానం చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్సార్ ఇంతియాజ్, రఫీ అహ్మద్, శ్రీదేవి, ఉస్మాన్, హసన్, ఆదిల్, సయీద్, ఫాజిల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణా శిబిరాల్లోని క్రీడాకారులకు బుధవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ సుబ్బరాజు మాట్లాడుతూ సభ్యులు హైటెక్ రమణారెడ్డి మనుమరాలు నిష్కారెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని క్రీడాకారులకు పౌష్టికాహారం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నిర్వాహకులు ఎస్.రమేష్‌బాబు, కె.జయదేవ్, ఎం.నరేంద్రరెడ్డి, రాఘవేంద్రశెట్టి తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురవుతున్న బీచ్‌లు



కాటేపల్లి బీచ్‌లో నీరు ముందుకు రావడంతో కోతకు గురవుతున్న తీరం

తోటపల్లిగూడూరు : వాతావరణంలో చోటుచేసుకొంటున్న పెను మార్పులు, అలల ఉధృతి కారణంగా సముద్రపు నీరు ముందుకు చొచ్చుకొని వస్తోంది. మండలంలోని కోడూరు, కాటేపల్లి తీర ప్రాంతాల్లో ఈ రకమైన ఘటనలు గత కొద్ది కాలంగా వెలుగుచూస్తోంది. సాధారణం కంటే సుమారు 50 మీటర్ల మేర సముద్రపు నీరు ముందుకు వస్తోంది. దీంతో తీర ప్రాంత వాసులు, మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోడూరు, కాటేపల్లి సముద్రతీర ప్రాంతాల్లో గత కొద్దిరోజులుగా అలలు ఉవ్వెత్తిన ఎగసి పడుతున్నాయి. ఈ క్రమంలో తీరం కోతకు గురవుతోంది. మునుపెన్నడూ లేని విధంగా అలల ఉధృతి పెరగడమే కాకుండా సముద్రపు నీరు ఊహించని రీతిలో ముందుకు వస్తుండడం పట్ల తీర ప్రాంత వాసులు, అధికారులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. కోడూరు బీచ్ కంటే కాటేపల్లి సముద్రతీరం అధికంగా కోతకు గురవుతోంది. ఈ పరిణామాలతో పర్యాటకులు సైతం భయాందోళనకు గురవుతున్నారు.

లైసెన్సులను రద్దు చేస్తాం

• ఎఫ్‌డీఓ పొట్టియ్య



మాట్లాడుతున్న ఎఫ్‌డీఓ పొట్టియ్య

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : చేపలకు మేతగా చికెన్ వ్యర్థాలు వేస్తున్న రైతులను గుర్తించి వారి లైసెన్సులను రద్దు చేస్తామని బుచ్చిరెడ్డిపాళెం ఎఫ్‌డీఓ పొట్టియ్య హెచ్చరించారు. ఆయన బుచ్చిరెడ్డిపాళెంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల్లో చేపల సాగు చేస్తున్న రైతులు వాటికి మేతగా చికెన్ వ్యర్థాలు వేస్తున్నారన్నారు. దీని వల్ల సమీప గ్రామస్తులు దుర్వాసన కారణంగా అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఈ విషయమై తమ సిబ్బందితో కలిసి నిత్యం గ్రామాల్లో పర్యటించి చేపల గుంతల్లో చికెన్ వ్యర్థాలు వేస్తున్న వారిని గుర్తించి లైసెన్సులను రద్దు చేసేందుకు చర్యలు చేపడుతామని తెలిపారు. చికెన్ వ్యర్థాలను తీసుకొస్తున్న వాహనాలపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇందుకు గ్రామస్తులు కూడా సహకారం అందించాలని, చికెన్ వ్యర్థాలు వేస్తున్న వారి వివరాలను తమకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఇప్పటికైనా చేపల గుంతలు సాగు చేస్తున్న రైతులు చేపలకు ఆహారంగా చికెన్ వ్యర్థాలను వేయకుండా ప్రత్యామ్నాయ ఆహారాలను ఎంచుకోవాలని ఆయన సూచించారు.